సాక్షి
అనకాపల్లి
సోమవారం । 31 । మార్చి । 2025

అభివృద్ధి జపం
ప్రజారోగ్యం పణం

అచ్యుతాపురం కూడలిలో మోసయ్యపేట అచ్యుతాపురం గ్రామాల మీదుగా ఫ్లైఓవర్ నిర్మాణం శంకుస్థాపనకు మంత్రి నారా లోకేష్ సోమవారం హాజరవుతున్నారు. సుమారు రూ.62 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఫ్లైఓవర్ కోసం కూటమి ప్రభుత్వం నేటికీ ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా, స్థానిక నిర్వాసితులతో చర్చించకుండా సమస్యలపై దృష్టి పెట్టకుండా ముందుకు వెళ్లడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది.

- ప్రత్యామ్నాయం వదిలి ఫ్లైఓవర్‌కే ప్రభుత్వం మొగ్గు
- ప్రజా అభిప్రాయ సేకరణ లేకుండా నిర్మాణ పనులకు సిద్ధం
- కాలుష్యం పెరుగుతుందని ప్రజల ఆందోళన
- బాధితుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం


పూర్తిగా నిర్మాణాలు చేపట్టిన గ్రామాల మధ్య నుంచి ఫ్లై ఓవర్ నిర్మాణం జరగబోయే స్థలం


ఫ్లై ఓవర్ స్తంభాలు గోతులు తీయడానికి సిద్ధంగా ఉన్న డ్రిల్లింగ్ మెషినరీ

అచ్యుతాపురం రూరల్: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో సెజ్ పరిశ్రమలు ఏర్పడి నేటికి దశాబ్దాల కాలం గడుస్తోంది. రహదారుల నిర్మాణంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలు నెలకొల్పేటప్పుడే ఆలోచన చేస్తాయి. ఒక ఇంటి నిర్మాణానికి మూడు సెంట్లు ఇల్లు కట్టుకోవడానికే ఎవరైనా కనీసం 10 అడుగుల దారైనా ఉంటేనే స్థలం కొనడానికి ముందుకురారు. అలాంటిది ప్రభుత్వాలు వందల పరిశ్రమలు నెలకొల్పే ఆలోచన ఉన్నప్పుడు ఎన్ని రహదారులు అందులో ప్రజలకు పర్యావరణానికి హాని కలగని రీతిలో చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం ఎటువంటి ప్రజా అభిప్రాయ సేకరణ లేకుండా గ్రామాలను అనుసరించి ఫ్లై ఓవర్‌లు నిర్మించడానికి సిద్ధం అవుతుండడం ప్రజాగ్రహానికి కారణమవుతోంది.

వందల పరిశ్రమలు ఉన్న చోట రోజుకు వేలాది వాహనాలు ఒకే రహదారిలో రాకపోకలు చేసే చోట కాలుష్యం ఏ స్థాయిలో పెరిగిపోతుందో అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక పరిశ్రమ నెలకొల్పాలంటే చుట్టు ప్రక్కల జనావాసానికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారు. అలాంటిది వందల ప్రైవేట్ రంగ పరిశ్రమలు, పదుల ఖ్యలో ప్రభుత్వ రంగ పరిశ్రమలు వస్తాయని చెబుతున్న చోట ఇంకెంత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఏదైనా పరిశ్రమలో ఒక చిన్న ప్రమాదం జరిగితే నేరుగా ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు ఉన్న ఏకైక దారి అనకాపల్లి- అచ్యుతాపురం రహదారి మాత్రమే. అది తప్ప ఈ వందల పరిశ్రమలకు మరో దారి లేదు. ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధి ఊసెత్తకుండా ఉన్న రహదారినే వెడల్పు చేసేందుకు ప్రజల ఆయురారోగ్యాలను పణంగా పెట్టి ఫ్లై ఓవర్ ఏర్పాటు చేసేందుకు తారా స్థాయిలో ప్రయత్నాలు చేస్తుండడంపై స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

విన్నపాలు బుట్టదాఖలేనా?

అచ్యుతాపురం భవన యజమానుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ ప్రగడ నాగేశ్వరావుకి ఫ్లై ఓవర్ నిర్మాణం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఎన్నో విన్నపాలు అందజేశారు. పలు మార్లు ఆర్‌డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫ్లై ఓవర్ నిర్మాణం వల్ల స్థానిక ప్రజలకు కలిగే ఆర్థిక, ఆరోగ్య నష్టాలను విన్నవించుకున్నారు. అభివృద్ధితో పాటు ప్రజారోగ్యం పైనా దృష్టి పెట్టాలని, ప్రజా ప్రతినిధులు, అధికారులు పునరాలోచనతో తగు న్యాయం చేపట్టేలా చర్యలు చేపట్టాలని బాధితులంతా కోరుతున్నారు.


జిల్లా కలెక్టర్‌కు సమస్యలు విన్నవించి వస్తున్న భవన యజమానుల సంఘం సభ్యులు (ఫైల్)

ప్రత్యామ్నాయ దారులు అవసరం



నా తల్లి బండారు కమలావతి ఇప్పటికే శబ్ద, వాయు కాలుష్యాల కారణంగా ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది. నా తల్లి మాదిరిగానే చాలా మంది వృద్ధులు, చిన్నారులు కాలుష్యం బారిన పడి అనారోగ్యం పాలౌతున్న వారు వందల సంఖ్యలో ఉన్నారు. పగలంతా కష్టపడి రాత్రి సేదతీరే సమయానికి గుండెలు అదిరేలా భీకర శబ్దాలతో భారీ వాహనాలు గ్రామంలో రాకపోకలు చేస్తుండడంతో బీపీ, మధుమేహం, హృద్రోగులు నిద్ర కోల్పోయి అనారోగ్యం పాలవుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ నిర్మాణ ఆలోచన విరమించుకోవాలి. ప్రత్యామ్నాయ రహదారులకు చర్యలు తీసుకోవాలి.

– గుప్తా కుమార్, అచ్యుతాపురం

విభజించి పాలిస్తున్నారు



ఆంగ్లేయుల సూత్రమైన విభజించి పాలించడం అనే భావనతో రోడ్డు విస్తరణలో అధికారులు, ప్రజా ప్రతినిధులు చాక చక్యంగా బాధిత కుటుంబాలపై అభివృద్ధి అస్త్రం ప్రయోగిస్తున్నారు. ఎక్కడికక్కడ గ్రామాలుగా విభజించి నష్టపరిహారాలు ఇస్తామని నమ్మబలికి అతి తక్కువ ధరకు బేరం కుదుర్చుకుంటూ ఒకరితో మరొకరికి పొంతన లేకుండా రైతులకు, భూనిర్వాసితులకు అన్యాయం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు, వాణిజ్య సముదాయాలు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, పునరావాసం కల్పించాలి. గ్రామ సభలు నిర్వహించి నిర్వాసితులందరికీ టీడీఆర్ బాండ్ల స్థానంలో నగదు చెల్లించాలి.

–రొంగలి రాము, సీపీఎం మండల కన్వీనర్

నిర్వాసితులను మభ్యపెట్టడం తగదు..



పరిశ్రమలు వస్తే ప్రత్యక్షంగా అలాగే పరోక్షంగా స్థానికంగా ఉన్నవారు అభివృద్ధి చెందుతారనే సదుద్దేశంతో రైతులు భూములు, ఇళ్లు, వాణిజ్య భవనాలు కోల్పోతున్నా రోడ్డు విస్తరణకు సహకరిస్తున్నారు. అయితే వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం వెంటనే నగదు రూపంలో పరిష్కారం చేయాలే తప్ప టీడీఆర్ బాండ్లు అంటూ మభ్యపెట్టడం సరికాదు. అనకాపల్లి అచ్యుతాపురం రహదారి ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలోనే ఉంది. వుడా ఆధ్వర్యంలో లేదు. కూటమి ప్రభుత్వం సమస్యని పక్కదోవ పట్టించడానికి ప్రయత్నిస్తోంది. ఈ ప్రాంత ప్రజలు ఎక్కువ శాతం కేవలం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వచ్చే ఉద్యోగ, ఉపాధి అవకాశాలపైన ఆశ కంటే ఇప్పుడు పోతున్న భూములపైనే ప్రాణాలు పెట్టుకున్నారు. భూ నిర్వాసితులకు సరైన న్యాయం చేయకుంటే ఆందోళన తప్పదు.

–బొడ్డేడ ప్రసాద్, వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి



ఢిల్లీ షో


అద్భుతమైన క్యాచ్ అందుకున్న జేక్ ఫ్రేజర్


నిరాశతో వెనుదిరుగుతున్న నితీశ్

- సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఘన విజయం
- విశాఖ వేదికగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు

విశాఖ స్పోర్ట్స్: డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియం ఆదివారం క్రికెట్ అభిమానుల కేరింతలతో మార్మోగింది. తమ రెండో హోం గ్రౌండ్‌గా వైఎస్సార్ స్టేడియంను ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆడిన రెండో మ్యాచ్‌లోనూ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. అభిషేక్ పోరెల్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించడంతో స్టేడియం సంబరాలతో నిండిపోయింది. మిచెల్ స్టార్క్ తన బౌలింగ్‌తో హైదరాబాద్ బ్యాటర్లను వణికించాడు. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, స్థానిక ఆటగాడు నితీష్ కుమార్ త్వరగా అవుట్ కావడంతో విశాఖ అభిమానులు నిరాశ చెందారు. కాగా..

ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. స్టేడియంలోని స్టాండ్లన్నీ నిండిపోయాయి. సొంత జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌తో పాటు తెలుగు జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను కూడా ప్రోత్సహించారు. ఈ సీజన్‌లో విశాఖ వేదికగా జరిగిన రెండు మ్యాచ్‌లు ఢిల్లీ క్యాపిటల్స్‌కు మరచిపోలేని అనుభూతిని మిగిల్చాయి. క్రికెట్ అభిమానుల ఆదరణ, స్టేడియంలో నెలకొన్న సందడి ఐపీఎల్‌కు ఉన్న క్రేజ్‌ను మరోసారి నిరూపించాయి. ఐసీసీ చైర్మన్ జైషా, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, భారత మహిళా క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్, ఏసీఏ అధ్యక్ష కార్యదర్శులు కేశినేని చిన్ని, సతీష్‌బాబు తదితరులు ఈ మ్యాచ్‌ను వీక్షించారు.


కెప్టెన్ అక్షర్, స్టార్క్ విజయదరహాసం


మ్యాచ్‌ను తిలకిస్తున్న జై షా, రామ్మోహన్‌నాయుడు, లోకేష్


మిథాలీరాజ్


యువత.. కేరింత..

సారూ..నాటి హామీలు గుర్తున్నాయా?


యువగళం పాదయాత్రలో లోకేష్‌కు మత్స్యకార సమస్యలపై మత్స్యకార నాయకుడి వినతి (ఫైల్)

అచ్యుతాపురం రూరల్: యువగళం పాదయాత్రలో పూడిమడక మత్స్యకారులకు ఇచ్చిన ఎన్నికల హామీని మంత్రి లోకేష్ నెరవేర్చాలని జిల్లా మత్స్యకార నాయకుడు చోడిపల్లి అప్పారావు కోరారు. ప్రభుత్వం ఏర్పడితే మత్స్యకారుల సమస్యలన్నీ నెరవేర్చుతామని ఇచ్చిన హామీ సోమవారం అచ్యుతాపురం వస్తున్న సందర్భంగా నెరవేర్చాలన్నారు. ఏపీఐఐసీ పైప్ లైన్ ప్యాకేజ్, బ్రాండిక్స్ ప్యాకేజ్, మత్స్యకారులకు వేట నిషేధ భృతి రూ.20 వేలు, ఫిషింగ్ జెట్టి నిర్మాణం త్వరగా పూర్తి చేసి మత్స్యకారులకు ఉపాధి, స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనలో మత్స్యకార యువతకు న్యాయం చేయాలని కోరారు.

కల్యాణ వేంకటేశునికి లక్ష మల్లెల పూజ


లక్ష మల్లెల పూజలందుకున్న స్వామి ఉత్సవ మూర్తులు

ఎస్.రాయవరం: దార్లపూడి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి లక్ష మల్లెల పూజ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఉగాదికి స్వామి ఉత్సవ మూర్తులకు లక్ష మల్లెలు సేకరించి పూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మల్లె భక్తుల నుంచి సేకరించే కార్యక్రమం నెల రోజుల ముందు నుంచి ప్రచారం చేసి ఉగాదినాడు అయితే మల్లెపూలు, లేకపోతే వారు ఎన్ని మల్లెపూలు ఇవ్వగలరో అంతటి నగదు చెల్లించి పూజలో పాల్గొన్నారు. దార్లపూడి, చినగుమ్ములూరు, అడ్డురోడ్డు, పెదగుమ్ములూరు, భీమవరం, పెట్టుగోళ్లపల్లి, యలమంచిలి మండలం పీఎస్ఆర్‌పేట, ఏటికొప్పాక, కోటవురట్ల మండలం పందూరు, రామచంద్రపురం, కైలాసపట్నం గ్రామాలకు చెందిన సుమారు ఐదు వందల మంది భక్తులు పూజలో పాల్గొన్నారు.


తీరంలో పర్యాటక సందడి

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రేవుపోలవరం తీరం పర్యాటకులతో పోటెత్తింది. వీకెండ్, పండగ ఒకే రోజు రావడంతో ఉద్యోగులు, యువత పెద్ద ఎత్తున తీరానికి చేరుకుని కేరింతలు కొట్టారు. దీంతో తీరంలో సందడి వాతావరణం నెలకొంది.

-ఎస్.రాయవరం

వేతన ఒప్పందం అమలు చేయాలి


మామిడిపాలెం క్వారీ కార్మిక సంఘం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి: మండలంలో వివిధ క్వారీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు 11వ వేతన ఒప్పందం తక్షణమే అమలు చేయాలని ఏప్రిల్ 1న సమ్మె చేయడం జరుగుతుందని జిల్లా క్వారీ క్రషర్స్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కోన మోహనరావు అన్నారు. మామిడిపాలెం క్వారీ కార్మిక సంఘం కార్యాలయం వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ మెటల్ అండ్ బిల్డింగ్ స్టోన్ క్వారీలలో కంప్రెసర్లపై డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పనులకు వెళ్తున్న కార్మికులకు రెండేళ్లుగా కూలీ రేట్లు, జీతభత్యాలు పెంచకుండా, క్వారీ యాజమాన్యం కార్మికుల శ్రమదోపిడీ చేస్తుందన్నారు. మండలంలోని 150కి పైగా క్వారీ లీజుల్లో ఉత్పత్తి జరగాలంటే క్వారీ డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పని కార్మికులు ప్రధానం అన్నారు. నిరంతరం ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న ఈ కార్మికుల సమస్యలను మాత్రం యజమానులు పట్టించుకోవట్లేదన్నారు.

క్వారీ, స్టోన్ క్రషర్స్‌లో ప్రమాదం జరిగి కార్మికుడు మరణించినప్పుడు ఆ కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారంగా రూ. 25 లక్షల చెల్లించాలని, అంత్యక్రియలు ఖర్చులకు రూ. 2 లక్షల ఇవ్వాలన్నారు. కార్మికుడు అంగవైకల్యానికి గురైతే 'వర్క్ మెన్ కాంపెన్సేషన్ యాక్ట్–1923' ప్రకారం (క్వారీ, స్టోన్ క్రషర్స్ యాజమాన్యం) నష్టపరిహారం చెల్లించి, వైద్యం ఖర్చులు భరించాలన్నారు. కంప్రెషర్ కార్మికులు కిడ్నీ వ్యాధులు, టీబీ, పక్షవాతం వంటి ఇతర దీర్ఘకాలిక అనారోగ్యాలకు గురై, రిటైర్ అయితే కంప్రెషర్ ఓనర్ ఆ కార్మికుడికి 'గ్రాట్యూటీ చట్టం –1972' కింద రూ.లక్ష చెల్లించాలన్నారు. కంప్రెషర్ కార్మికులకు ప్రతి నెలా 10వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

శ్రీ విశ్వావసు...ఆశల ఉషస్సు..


అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న హోంమంత్రి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్

గవరపాలెం నూకాంబిక ఆలయంలో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

అనకాపల్లి నూకాంబిక ఆలయంలో పంచాంగ శ్రవణం

జిల్లాలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి నూకాంబిక ఆలయంలో కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో ముఖ్య అతిథిగా హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజులు పాల్గొని నూకాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితుడు బంకుపల్లి సత్యన్నారాయణ పంచాగ శ్రవణం చేశారు. చిన్నారి నృత్య ప్రదర్శన అలరించింది. ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. గరుడాద్రిపర్వతంపై కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, తిరుమంజనం సేవ నిర్వహించారు. ఆలయప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. విశ్వావసు నామసంవత్సరంలో వచ్చే మంచి చెడులను రాశీఫలాలను వివరించారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉంటాయని వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయన్నారు. రాజకీయాల్లోను, పాలనాపరంగా చోటు చేసుకునే విశేషాలను వివరించారు.చినదొడ్డిగల్లు శ్రీరామ పంచాయతన ఆలయంలో ధర్మకర్త, విశ్రాంత ఉపాధ్యాయుడు, రాష్ట్రపతి అవార్డుగ్రహీత శ్రీపాద సత్యదేవ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. ఆలయాల్లో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.


ఉపమాక ఆలయంలో ప్రత్యేక అలంకరణలో గోదాదేవి

ఉగాది సందర్భంగా ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు

ఘనంగా ఉగాది వేడుకలు 8లో

ప్రజలు సుభిక్షంగా ఉండాలి


తారువ పంచాంగ శ్రవణంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సిరి సంపదలతో ఆనందంగా ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ఆకాంక్షించారు. తారువ రామాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన పంచాంగ శ్రవణంలో ఆలయ పురోహితుడు గ్రామస్తులకు రాశి ఫలాలను తెలియజేశారు. అనంతరం బూడి మాట్లాడుతూ తారువ గ్రామాన్ని అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దినందుకు ఆనందంగా ఉందన్నారు. గ్రామ ఆదాయ, ఖర్చుల లావాదేవిలను ప్రజలకు సమగ్రంగా తెలియజేశారు.

క్లుప్తంగా

మద్యం షాపు వద్దే వద్దు



విజయరామరాజుపేటలో టెంట్ వేసి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట: మండలంలో గల విజయరామరాజుపేట గ్రామంలో మద్యం షాపునకు అనుమతి ఇవ్వొద్దని గ్రామస్తులు రెండో రోజు ఆదివారం ఆందోళనకు దిగారు. ఇటీవల కొత్తగా గీత కార్మికులకు మంజూరైన మద్యం షాపును విజయరామాజుపేటలో ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మద్యం షాపు ఏర్పాటుకు గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం,డ్వాక్రా సంఘ సభ్యులు శనివారం అభ్యంతరం తెలిపి అడ్డుకున్నారు. రెండో రోజు గ్రామ అఖిలపక్ష నాయకులతో కలిసి గ్రామస్తులు టెంట్ వేసి మద్యం షాపు ఏర్పాటు చేయొద్దని ఆందోళనకు దిగారు.

ఇద్దరు యువకులను కాపాడిన మెరైన్ పోలీసులు



తీరంలో మునిగిన యువకులను కాపాడిన మెరైన్ పోలీసులు

ఎస్.రాయవరం: తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడుకు చెందిన యువకులు,నక్కపల్లి మండలం సారిపల్లి పాలెం గ్రామానికి అమ్మమ్మ ఇంటికి వచ్చి ఆదివారం రేవుపోలవరం తీరానికి వచ్చారు. తీరంలో స్నానం కోసం అన్నదమ్ములైన బర్ల బాలు, గోపిలు సముద్రంలోనికి దిగారు. పెద్ద కెరటం రావడంతో మునిగిపోయారు. ఒడ్డున గస్తీ కాస్తున్న మెరైన్ ఏఎస్ఐ ఎం.కృష్ణ, కానిస్టేబుల్ పి.చినబాబు.హెచ్‌జిలు అప్పలకొండ, జగన్నాథం వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. సకాలంలో మెరైన్ పోలీసులు స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. యువకులను కాపాడిన మెరైన్ పోలీసులను పెంటకోట పోలీస్‌స్టేషన్ మెరైన్ సీఐ మురళి అభినందించారు.

ఘనంగా ఉగాది వేడుకలు

- నూకాంబిక సన్నిధిలో హోంమంత్రి, కలెక్టర్, ప్రముఖులు
- ఆలయాల్లో వేడుకగా పంచాంగ శ్రవణాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ఉపమాక ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో ముఖ్యఅతిథిగా హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు పాల్గొని నూకాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, రాష్ట్రం సుభీక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడి, భవిష్యత్ తరాలకు వారసత్వంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, ఎస్పీ తుహిన్ సిన్హా, స్టేట్ కార్పొరేషన్ చైర్మన్‌లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ, ఆర్‌డీవో షేక్ ఆయిషా, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, సహాయ కమిషనర్ వెంపలి రాంబాబు, పండగ ప్రత్యేక అధికారి శోభారాణి, జిల్లా దేవదాయ శాఖాధికారి సుధారాణి, తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో వేద పండితుడు బంకుపల్లి సత్యనారాయణ పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం జిల్లాలోని వివిధ ఆలయాల అర్చకులను కలెక్టర్, ఎస్పీలు సత్కరించారు.

ఉపమాకలో ఉగాది ప్రత్యేక పూజలు

నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయంలో ఉగాది సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్‌కు తెల్లవారు జామున 3 గంటలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ శుద్ధి అనంతరం ప్రత్యేక తిరుమంజనం కార్యక్రమం జరిపారు. అనంతరం కొండ దిగువ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ఆలయంలోను, స్వామివారి ఉత్సవ మూర్తులు, ఆండాళ్లమ్మవారి సన్నిధిలో ఉపాలయాల్లో విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ ఏడాదిలో ఎండలు ఎక్కువగా ఉంటాయని, వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయన్నారు.



ఉపమాక గరుడాద్రిపై స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న హోంశాఖ మంత్రి అనిత



నాట్య ప్రదర్శన చేస్తున్న చిన్నారి

సందడిగా చిలకల తీర్థం



తీర్థంలో పంచదార చిలకల స్టాళ్లు



దేవుళ్ల ప్రతిమల విక్రయాలు



పేరంటాలమ్మ తీర్థంలో భక్తుల సందడి



తీర్థంలో ఏర్పాటు చేసిన చిన్న చిన్న పాత్రల దుకాణాలు

పాయకరావుపేట: పాయకరావుపేట పట్టణంలో ఆదివారం జరిగిన పేరంటాలమ్మ(చిలకల తీర్థం) తీర్థానికి భక్తులు పోటెత్తారు. మంగవరం వెళ్లే రోడ్డులో పేరంటాలమ్మ గుడి ఉంది. ప్రతి సంవత్సరం ఉగాది రోజున తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. ముందుగా పేరంటాలమ్మను దర్శించుకుని, పక్కనే ఉన్న సీతారాముల ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. రామాలయ అభివృద్ధి కమిటీ వానర సేన బృందం సభ్యులు భక్తుల దర్శనాలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. అనంతరం ఇక్కడి మూడు రోడ్ల కూడలిలో జరిగే తీర్థానికి పాయకరావుపేట, తుని, నక్కపల్లి, ఎస్.రాయవరం తదితర మండలాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. తీర్థంలో ప్రత్యేక ఆకర్షణగా పంచదార చిలకలు విక్రయాల స్టాళ్లు నిలిచాయి. పిల్లలు ఆడుకునే వస్తువులు, ప్లాస్టిక్ సామగ్రి, చైనా బొమ్మల విక్రయాల దుకాణాలు కూడా రద్దీగా కనిపించాయి. ఇళ్లల్లో అలంకరణ వస్తువుల విక్రయాలు కూడా జోరుగా సాగాయి. వంట సామగ్రి పాత్రలు, చికెన్ సామగ్రి కూడా అమ్మకాల కోసం కూడా ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేశారు. తీర్థంలో భక్తులు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు సందడి చేశారు. ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ జి.అప్పన్న ఆధ్వర్యంలో 100 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తీర్థంను పరిశీలించారు. నక్కపల్లి సీఐ రామకృష్ణ, ఎస్ఐ కుమారస్వామి, ఎస్.రాయవరం ఎస్ఐ విభీషణరావు కూడా బందోబస్తుకు హాజరయ్యారు.

ముగిసిన నాటిక పోటీలు



రేపటి శత్రువు నాటికలో సన్నివేశం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వి.వి. రమణ రైతు భారతి కేంద్రంలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్, డైమండ్ హిట్స్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న నాటిక పోటీలు ఆదివారంతో ముగిసాయి. ఈ కార్యక్రమాన్ని బి.ఎం రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ నాటికలు ఆహూతలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆలోచింపజేసిన రేపటి శత్రువు..

ఈ కాలం పిల్లలు తన ఇల్లు, భార్య, తన సంతానం అని గిరి గీసుకుంటున్నారు. అందులో మరొకరికి స్థానం లేదు. ఇది పెద్దవాళ్ళు అర్థం చేసుకోవాలి. నష్టమయినా, కష్టమయినా ఈ జీవిత సత్యాన్ని జీర్ణం చేసుకోవాలి. లేకపోతే వాళ్ళ జీవితం దుర్భరమైపోతుందని ప్రదర్శించిన నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది.

యాంత్రిక యుగంలో..'కొత్త సైన్యం'..

మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా మానవ జీవితంలో వేగం పెరిగిపోయింది. ఈ వేగంలో మానవ సంబంధాలు బలహీనమై పోయాయి. పిల్లలు పట్టించుకోవడం లేదని వాళ్ళని ఆడిపోసుకోవడం అనవసరం. ఇది యాంత్రిక యుగం. అంటే మనిషి యంత్రంలా జీవిస్తాడనే అర్థం. ఈ కాలానికి తగట్లు మనమే మారాలి. మన శేష జీవితాన్ని దేశానికి అంకితం చేయాలి... అని నిర్ణయిచుకున్న పెద్దలు ఈ నాటికలో కనిపిస్తారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, బొడ్డేడ జగత్‌రావు, కర్రి దివాకర్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంస్కృతిని కాపాడుకోవాలి

జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు డి.డి.నాయుడు

మాడుగుల రూరల్: హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ప్రతి హిందూ బంధువు హిందూ ధర్మానికి కట్టుబడి ఉండాలని జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు డి.డి.నాయుడు పేర్కొన్నారు. కె.జె.పురం కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మండల విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు రాపేట రామకొండలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయుడు మాట్లాడుతూ శ్రీరాముని ధర్మపాలన గురించి రామాయణ, మహాభారతం, భాగవతం గ్రంథాల ప్రాముఖ్యత గురించి వివరించారు. జిల్లా వీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి ఆరవల్లి సాయి ప్రదీప్ మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణకు వీహెచ్‌పీ ఎనలేని కృషి సల్పిందన్నారు. సమావేశంలో జిల్లా బాధ్యులతో పాటు సమరతాసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తవ్వా సన్యాసిశెట్టి, మూడు మండలాల ప్రఖండ్ చిరంజీవినాయుడు, మండల వీహెచ్‌పీ అధ్యక్షుడు కరణం దేముళ్లు, కార్యదర్శి పెచ్చెట్టి కొండలరావుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు, వివిధ విభాగాలు అధ్యక్షులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం జిల్లా అధ్యక్షుడు నాయుడు, కార్యదర్శి ప్రదీప్ తదితరులు వీహెచ్‌పీ మండల కమిటీ సారథ్యంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చీడికాడ, మాడుగుల, మండలాలకు చెందిన వీహెచ్‌పీ గ్రామ శాఖ కమిటీ సభ్యులు, ప్రఖండ్ సభ్యులు, పాల్గొన్నారు.

చిననందిపల్లిలో ఆలయంలో చోరీ

- రూ.2 లక్షల విలువైన ఆభరణాల అపహరణ
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ఆలయంలో చోరి జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మల్లేశ్వరరావు



ఆలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్ సిబ్బంది

దేవరాపల్లి: మండలంలోని చిననందిపల్లిలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయంలో భారీ దొంగతనం జరిగింది. ఆలయం గేటును శుక్రవారం రాత్రి పెకిలించి దొంగలు ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించారు. బాల త్రిపుర సుందరి అమ్మవారికి అలంకరించిన కేజీ వెండి కిరీటంతో పాటు చేతులకు అమర్చిన వెండి కవచాలు, మెడలోని అరుతులం బంగారు మంగళ సూత్రాలు, పావుతులం ముక్కు పుడక దొంగలు అపహరించుకుపోయారు. చోరీకి గురైన అభరణాల విలువ సుమారు రూ. 2లక్షలు మేర ఉంటుందని గ్రామ పెద్దలు పోతల రఘు తదితర్లు తెలిపారు. కాగా ఈ ఆలయం దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉండడంతో జరిగిన విషయాన్ని గ్రామస్తులు సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ విషయమై దేవరాపల్లి పోలీస్‌లకు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు శనివారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ టి.మల్లేశ్వరరావు సంఘటాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆదివారం తెలిపారు.

భారీ వాహనాల రాకతో అవస్థలు



కశింకోట వద్ద హైవేని ఆక్రమించి వెళ్తున్న భారీ వాహనం

కశింకోట: కశింకోటలోని జాతీయ రహదారిపై రెండు అతి భారీ వాహనాలు తరలి వెళ్లడంతో వాహనాల రాకపోకలకు ఆదివారం అంతరాయం కలిగింది. దీంతో వాహన చోదకులు నానా అవస్థలు పడ్డారు. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు రోడ్డు వెడల్పున యంత్రాలతో కూడిన రెండు పెద్ద కంటైనర్ వాహనాలు తరలి వెళ్లాయి. ఇవి ఒక వైపు రోడ్డు వెడల్పు భాగం అంతా మూసి వేయడంతో వెనక నుంచి వచ్చే వాహనాలు ముందుకు వెళ్లే మార్గం లేక వాటి వెంబడి నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. దీంతో వాహనాలు సుమారు కిలోమీటరు పైగా బారులు తీరాయి. రద్దీ సమయంలో ఇటువంటి భారీ వాహనాలను ఇరుకు రోడ్లలోకి అధికారులు అనుమతించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో భారీ వాహనాలకు అనుమతి ఇవ్వాలని కోరారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి



మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

పాయకరావుపేట: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పరివర్తన నిలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాస్టర్ మృతి వెనుక ఆర్‌ఎస్‌ఎస్ హస్తముందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని కొంత మంది పెద్దల హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ విచారణ బృందం వల్ల ప్రయోజనం లేదన్నారు. హంతకులను రక్షించేలా పోలీసు విచారణ జరుగుతుందన్నారు. ప్రవీణ్ పగడాల మరణం రోడ్డు ప్రమాదంలో జరగలేదని, ఇది కచ్చితంగా ఉద్దేశపూర్వకంగా ముందస్తు ప్రణాళికతో జరిగిన హత్యని కృష్ణ స్వరూప్ ఆరోపించారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో అనుమతులు లేని చర్చిలను తొలగించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం అత్యంత దారుణమన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీదు, రాష్ట్ర నాయకురాలు దాసరి అన్నపూర్ణ, మాల మహానాడు పాయకరావుపేట అసెంబ్లీ ఇన్‌చార్జ్ బడుగు అచ్చారావు, తదితరులు పాల్గొన్నారు.

వాకపల్లి మెట్ట వద్ద ఆటో బోల్తా

ఐదేళ్ల బాలుడితో సహా ఇద్దరికి గాయాలు



వాకపల్లి మెట్ట వై జంక్షన్ వద్ద బోల్తాపడిన ఆటో



తీవ్రంగా గాయపడ్డ పట్నాల భార్గవ్



అపస్మారక స్థితిలో ఉన్న గొంది ఈశ్వరమ్మ

దేవరాపల్లి: వాకపల్లి మెట్ట దగ్గర వై జంక్షన్ సమీపంలో గల మలుపు వద్ద ఆదివారం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదేళ్ల బాలుడితో సహా ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు స్పందించి బాధితులను 108 వాహనంలో కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాదంలో పెదనందిపల్లి గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు పట్నాల భార్గవ్ కాలికి తీవ్ర గాయమైంది. గొండి ఈశ్వరమ్మ తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుల బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. చీడికాడ నుంచి ఐదుగురు ప్రయాణికులతో ఆటో బయలుదేరింది. వాకపల్లి వై జంక్షన్ దగ్గరకు రాగానే అదుపు తప్పిన ఆటో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి బలమైన గాయాలు కాగా, మిగిలిన వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఐపీఎల్ మ్యాచ్ చూసిన అనాథలు

సీపీకి కృతజ్ఞతలు



అనాథ పిల్లలతో కలిసి విక్టరీ సింబల్ చూపిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌ను వీక్షించేందుకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి 65 మంది అనాథ పిల్లలకు అవకాశం కల్పించారు. భీమిలిలోని ఎస్‌వోఎస్ సంస్థ నుంచి 45 మంది, గాజువాకలోని డిజైర్ సంస్థ నుంచి 20 మంది పిల్లలు ఈ మ్యాచ్‌ను చూశారు. పోలీస్ కమిషనర్ వారితో కలిసి కొంత సమయం గడిపారు. తమకు ఇంత మంచి అవకాశం కల్పించినందుకు పిల్లలు సీపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇది తమకు ఎంతో సంతోషాన్నిచ్చిందని వారు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన శ్రీను

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు సమీపంలో రేవుపోలవరం ఆర్అండ్‌బీ రోడ్డుపై వ్యాన్‌ను వెనక నుంచి బైకుతో ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్.రాయవరం పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. పెట్టుగోళ్లపల్లి గ్రామానికి చెందిన చొప్పా శ్రీను గుడివాడ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనును ముందుగా నక్కపల్లి, అనంతరం అనకాపల్లి, ఆ తరువాత విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

క్లుప్తంగా

పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత స్థానం



రత్నకుమారిని శాలువాతో సత్కరిస్తున్న జానకీరామరాజు, మలసాల కుమార్‌రాజా

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి పనిచేసిన వ్యక్తులకు పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం ఇస్తున్నారని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ పార్టీ సీనియర్‌ నాయకుడు మలసాల కుమార్‌రాజా తెలిపారు. మండలంలో గుండాల జంక్షన్‌ వద్ద నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన అంట్యాకుల రత్నకుమారిని శనివారం వారు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మాంసం అమ్మకాలు



కశింకోట సంతలో మాసం దుకాణం వద్ద నిరీక్షిస్తున్న ప్రజలు

కశింకోట: స్థానిక సంతలో మాంసం అమ్మకాలు ఆదివారం జోరుగా సాగాయి. కొత్త అమావాస్య శనివారం రావడంతో ఎక్కువ మంది మాంసం ముట్టరు. ఈ నేపథ్యంలో మరుసటి రోజు ఆదివారం రావడం, ఉగాదితో పాటు సెలవు రోజు కావడంతో ఇంటిల్లిపాది తినడానికి కోడి, మేక, గొర్రె మాంసం, గుడ్ల అమ్మకాలు జోరుగా సాగాయి. మాంసం విక్రయ దుకాణాలు కొనుగోలుదారులతో నిండిపోయాయి. దీంతో ఎక్కువ సమయం నిరీక్షించి మాంసాన్ని కొనుగోలు చేశారు.

మసీదుల అలంకరణ



నూరి మసీదు విద్యుద్దీపాలతో అలంకరణ

కశింకోట: మండలంలోని ముస్లింలు సోమవారం రంజాన్‌ పండుగను నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా కశింకోటలో జామియా మసీదు, నూరి మసీదులను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం 8.30 గంటలకు గ్రామ శివారులోని నూకాంబిక ఆలయ సమీపంలో ఈద్‌–ఘా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు నూరి మసీదు కమిటీ కార్యదర్శి ఎస్‌ఎంఎం అలీ తెలిపారు. చింతలపాలెం మసీదులో రంజాన్‌ పార్థనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

2 నుంచి ఉచిత పాలిసెట్‌ శిక్షణ

అనకాపల్లి: పాలిసెట్‌ ప్రవేశ పరీక్ష కోసం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక నర్సింగరావుపేట రామచంద్ర థియేటర్‌ వెనుక లక్ష్మి చారిటబుల్‌ ట్రస్ట్‌ కార్యాలయంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్‌ ఛైర్మన్‌ కాపారపు సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా విద్యార్థుల పేర్లు ట్రస్ట్‌ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440389409 సంప్రదించాలన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	:ట్రైలర్‌
సత్యనారాయణ స్క్రీన్‌-1	: రాబిన్‌హుడ్‌
పర్తిసాయి	: కోర్టు
షిర్డీసాయి	: ఎల్‌2: ఎంపురాన్‌ (లూజిఫర్‌-2)
వెంకటేశ్వర	: షణ్ముఖ
శ్రీసత్య	:సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర	: వీర ధీర శూర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్‌ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 25 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్‌-4 యూనిట్లు , బీ పాజిటివ్‌-11 యూనిట్లు, ఓ పాజిటివ్‌-9 యూనిట్లు ఏబీ పాజిటివ్‌-1 యూనిట్‌ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌ బ్యాంకు టెక్నీషియన్‌ యు.లోకేష్‌ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్‌ సమాచారం

అనకాపల్లి: ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ ద్వారా ఆదివారం 211 మంది గ్యాస్‌ బుక్‌ చేసుకున్నారు. గతంలో బుక్‌ చేసుకున్న వారిలో 106 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

మొదలైన ప్రజల కష్టాలు

• కశింకోటలో అరకొరగా తాగునీటి సరఫరా • ట్యాప్‌లు లేకపోవడం వల్ల నీరు వృథా • నత్తనడకన జలజీవన్‌ మిషన్‌ పనులు



పాత్రల సహాయంతో నీరు సేకరించి బిందె నింపుతున్న మహిళ



కశింకోటలో ట్యాప్‌లు లేక వృథాగా కుళాయి నుంచి పోతున్న నీరు

కశింకోట: వేసవి ప్రారంభంలోనే తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జల జీవన్‌ మిషన్‌ పనులు నత్తనడకన సాగుతుండటంతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల పనులు పూర్తి కాలేదు. దాంతో కశింకోట మేజర్‌ పంచాయతీ ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నీటి వనరులు, పథకాలు అందుబాటులో ఉన్నా, పలు వీధుల్లో కుళాయిల నుంచి అరకొర నీటి సరఫరా కావడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

కశింకోటలో 20 వేలు జనాభా కలిగిఉంది. గ్రామానికి ప్రధానంగా కోట దిబ్బ వద్ద మూడు రక్షిత పథకాల ట్యాంకుల ద్వారా మొత్తం 7.5 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన మూడు రక్షితనీటి పథకాలు, అగ్రహారం, సత్తెమ్మ కాలనీల్లో 40 లీటర్ల వంతున, ఇందిరా కాలనీ, హౌసింగ్‌ కాలనీల్లో పది వేల లీటర్ల వంతున తక్కువ సామర్థ్యం కలిగిన ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నారు. సుమారు 500 పబ్లిక్‌, ప్రైవేటు కుళాయిలు, 2 వేలకుపైగా ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు.

అధిక భాగం ఉప్పు నీరే...

కశింకోటలో అధిక భాగం ఉప్పు నీరే లభిస్తుండటంతో కుళాయిల నీరే తాగునీటికి ఆధారం. అయితే ఈ నీరు అరకొరగా సరఫరా కావడం, నిర్వహణ లోపంతోపాటు వేసవి ప్రారంభం కావడం వల్ల అరకొర నీటి సరఫరాతో పలు ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడక తప్పడం లేదు. ప్రధానంగా అమరపల్లి వీధి, కనక మహాలక్ష్మి వీధి, పెంటకోట వారి వీధి, గవరపేట పెద్ద గుమ్మం వీధి, గాడి వీధి, హౌసింగ్‌ కాలనీ, అఫీషియల్‌ కాలనీ సత్తెమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. కుళాయిల నుంచి ఆయా ప్రాంతాల్లో అరకొరగా నీరు సరఫరా అవుతోంది. దీంతో ప్రజలు నీటి కోసం ఇబ్బంది చెందుతున్నారు. సాధారణ రోజుల్లోనే ఇబ్బంది చెందుతుండగా, ఇప్పుడు వేసవి ప్రారంభం కావడంతో నీటికి మరింతగా ఇక్కట్లకు గురి కాక తప్పడం లేదని వాపోతున్నారు. అమరపల్లి వీధి నుంచి పూసర్ల వీధి వెళ్లే ప్రాంతం, గవరపేటలోని విశ్వ బ్రాహ్మణుల వీధి ప్రాంతం, కనక మహాలక్ష్మి వీధి, తదితర ప్రాంతాల్లోని కుళాయిల నుంచి అరకొర నీరు రావడంతో పాత్రల సహాయంతో నీరు బిందెల్లో తోడుకొని పట్టుకోవలసిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

కుళాయిల నీటి నుంచి నలకలు...

కుళాయిల నీటి నుంచి పలుచోట్ల నలకలు వస్తున్నాయి. ఉప్పునీటి దిబ్బ, పెద్ద గుమ్మం వీధి, కనక మహాలక్ష్మి వీధి తదితర ప్రాంతాల్లోని కుళాయిల నుంచి వచ్చే నీటిలో నలకలు వస్తుండటం, ఒక్కొక్కసారి రంగు మారిన నీరు వస్తుండటంతో కొందరు జాలీలు, రుమాళ్లు కుళాయిలకు చుట్టి నీరు పట్టుకోవలసిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. పబ్లిక్‌, ప్రైవేటు, ఇంటింటి కుళాయిలకు చాలా చోట్ల ట్యాప్‌లు లేకపోవడం వల్ల నీరు రోడ్లపై వృథాగా పోతోంది. దీంతో ఎగువ ప్రాంతాల్లోని కుళాయిలకు నీరు అందక ప్రజలు ఇక్కట్లు చెందక తప్పడం లేదు. ఇంటింటి కుళాయిలు వేసినా వాటికి భూగర్భంలో మట్టం చూడకుండా ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్‌ ఎగుడు, దిగుడుగా వేయడంతో చాలా కుళాయిల నుంచి నీరు సరఫరా కావడం లేదు. కొన్నింటి నుంచి తక్కువగా నీరు సరఫరా జరుగుతోంది. పల్లపు ప్రాంతాల్లో నీరు వస్తున్నప్పటికి వాటికి ట్యాప్‌లు లేక వృథాగా నీరు పోతోంది. దీంతో రోడ్లు బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని ప్రజలు వాపోతున్నారు. దీనిదృష్ట్యా ఎక్కడికక్కడ వాల్వులను ఏర్పాటు చేసి నిర్వహణ చేపట్టి నీటి సరఫరా చేయాల్సి ఉంది. అఫీషియల్‌ కాలనీలో కుళాయిలు సరిగ్గా రాకపోవడం వల్ల నీటికి ఇబ్బంది చెందుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

రోజు విడిచి రోజు మాత్రమే నీరు..


ఇంటింటి కుళాయిలు ఉన్నప్పటికి రోజు విడిచి రోజు మాత్రమే ఇస్తున్నారని, దీనివల్ల ఇక్కట్లు చెందుతున్నామని, రోజూ నీటిని అందివ్వాలని కోరుతున్నారు. ఐదు చోట్ల వడ్డి వీధి, గాడి వీధి, సత్తెమ్మ కాలనీ ప్రాంతాల్లో ఉన్న జగనన్న గృహ నిర్మాణ కాలనీల్లో కుళాయిలు తగినన్ని లేకపోవడం, అందుబాటులో లేకపోవడంతో తాగునీటిని దూరం నుంచి తెచ్చుకోవలసిన పరిస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ముమ్మందు ఎండలు తీవ్రతరంతో తాగునీరు లభ్యం కాక కటకటలాడాల్సిన దుస్థితి ఏర్పడనుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి నుంచే నీటి సరఫరా మెరుగుకు అవసరమైన చర్యలు అధికారులు తీసుకోవాలంటున్నారు.



ఉప్పునీటి దిబ్బ వద్ద జాలీ అడ్డుపెట్టి పడుతున్న కుళాయి నీరు

1500 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదు..

కశింకోటలో సుమారు 3500 ఇళ్లు ఉండగా 2 వేల ఇళ్లకు మాత్రమే కుళాయిలు ఇచ్చారు. ఇంకా 1500 ఇళ్లకు కుళాయిలు ఇవ్వాల్సి ఉంది. వీటిలో సుమారు 500 కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి జల జీవన్‌ మిషన్‌ కింద రూ.30 లక్షలు మంజూరై ఉన్నట్లు సమాచారం. అయితే పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతుందని విమర్శలున్నాయి. అధికారులు నిధులున్న మేరకు కుళాయిలు ఇవ్వడానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కుళాయిల నుంచి నీటి సరఫరాను మెరుగుపరచి తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని, రానున్న మండు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కశింకోట కోట దిబ్బ వద్ద మూడు ప్రధాన రక్షిత నీటి పథకాలు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కశింకోటలో తాగునీటి సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం. అమృతధార పథకంలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.4 కోట్లతో మరో రక్షితనీటి పథకాన్ని అనువైన చోట నిర్మించి మిగిలిన ఇళ్లకు ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి ప్రభుత్వానికి ప్రతిపాదించాం. నిధులు మంజూరై పనులు పూర్తయితే నీటి సమస్య పరిష్కారం కాగలదు. జల జీవన్‌ మిషన్‌ కింద రూ.30 లక్షలు మంజూరయ్యాయి. వాటితో పంచాయతీ సర్వే చేసి ఇచ్చిన తర్వాత మరో 500 మేర ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నాం. మరో రెండు బోర్లను ట్యాంకుల్లో నీటిని నింపడానికి అందుబాటులోకి తేవడానికి త్వరలో చర్యలు చేపడుతున్నాం.

– కోరిబిల్లి శ్రీనివాస్‌, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్‌, కశింకోట

విశ్వావసు.. ఉషస్సు



కశింకోట రామాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పురోహితుడు నెరసావర్జుల శర్మ



పురోహితుడు న్యాయపతుల రమణారావు, రమ దంపతులకు సత్కారం

కశింకోట: మామిడాకుల తోరణాలు.. మంగళవాయిద్యాలు, కోకిలమ్మ రాగాలు, షడ్రుచులతో చేసిన ఉగాది పచ్చడి రుచులు ఆస్వాదిస్తూ కొత్త తెలుగు సంవత్సరాది యుగాదికి ఘనంగా స్వాగతం పలికారు. మండల ప్రజలు ఆదివారం ఉగాది పర్వదినాన్ని సంప్రదాయబద్ధంగా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలు ధరించి ఉగాది పచ్చడి తయారు చేసి ఇంటిల్లిపాది స్వీకరించారు. కొందరు దేవాలయాల్లో ఉగాది పచ్చడి అందించడంతో దాన్ని ప్రసాదంగా స్వీకరించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కశింకోటలోని గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయం, కనకమహాలక్ష్మి వీధి, కస్పావీధి, పూసర్ల వీధి రామాలయాల్లో పురోహితులు పంచాంగ శ్రవణం చేసి ఈ ఏడాది కాలమానం ఎలా ఉండనుంది, రాశి ఫలాలు, సాగుకు అనుకూలమైన పంటలు తదితర అంశాల గురించి వివరించారు. వీటిని ప్రజలు ఆసక్తిగా విన్నారు. పెద్దలతోపాటు పిల్లలు, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పురోహితుడుకు సన్మానం

కశింకోట: స్థానిక అగ్రహారం వీధిలో ఆదివారం నిర్వహించిన ఉగాది పురస్కార సభలో పురోహితుడు న్యాయపతుల రమణారావు, రమ దంపతులను సత్కరించారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత హెచ్‌ఎం వేదుల వేంకటశాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో స్మార్థ విశారద పేరి పృథ్వీశర్మ పంచాంగ శ్రవణం చేశారు. డాక్టర్‌ కె.వి.రమణమూర్తి, సంఘం అధ్యక్షురాలు అవసరాల సీతా కామేశ్వరి, కార్యదర్శి మొక్కరాల కిశోర్‌కుమార్‌, కోశాధికారి గుల్లపల్లి వెంకటేశ్వర్లు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాకాశి వీధి నూకాంబిక సేవలో వైఎస్సార్‌సీపీ నాయకులు



కుమార్‌రాజా, జానకీరామరాజులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



గుండాల జంక్షన్‌ వద్ద మల్లమ్మతల్లిని దర్శించుకున్న కుమార్‌రాజా, జానకీరామరాజు

అనకాపల్లి: ఈ ఏడాది అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్‌ నాయకుడు మలసాల కుమార్‌రాజా అన్నారు. స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారిని ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 27వ తేదీ వరకూ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య పండగకు భక్తులు తాకిడి పెరుగుతుందన్నారు. ఆలయానికి వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆయన కమిటీ సభ్యులను కోరారు. అనంతరం మలసాల కుమార్‌రాజా, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజులను ఆలయ చైర్మన్‌ తాకాశి కిశోర్‌ శాలువాలతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొండా శంకరరావు, గైపూర్‌ రాజు, పెంటకోట శ్రీనివాసరావు, సూరిశెట్టి సత్తిబాబు, మారిశెట్టి శ్రీనివాసరావు, డొంక సత్తిబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుండాల జంక్షన్‌ వద్ద మల్లమ్మతల్లికి పూజలు

మండలంలో గుండాల జంక్షన్‌ వద్ద మల్లమ్మతల్లి పండగను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్‌ నాయకుడు మలసాల కుమార్‌రాజా, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి శనివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొన్నబత్తుల రమణ, వేగి త్రినాథ్‌, రాయవరపు జోగిరాజు, బుద్ద పెంటారావు, పాము సన్నిబాబు, రేబాక స్వామి, కొమ్మన శంకర్‌, మల్ల సత్యనారాయణ, బుల్లిబాబు, కొంకి శ్రీరామ్మూర్తి, బుద్ధరాజు, సూరిశెట్టి సత్తిబాబు, దానీ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ అందజేస్తున్న యూనియన్‌ నాయకులు

కశింకోట: నూకాంబిక ఆటో యూనియన్‌ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆటో స్టాండ్‌ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేసవి తాపం తీర్చడానికి జాతీయ రహదారిపై వెళ్లే వారికి మజ్జిగ పంపిణీ చేశారు. యూనియన్‌ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటాల ప్రదర్శన



నూకాంబిక ఆలయం వద్ద మహిళల కోలాటాల ప్రదర్శన



ఆరు బయట నూకాంబిక విగ్రహాన్ని దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట: స్థానిక నూకాంబిక ఆలయం వద్ద ఆదివారం రాత్రి మహిళల కోలాటాలు ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకున్నారు. కొత్త అమావాస్య ఉత్సవాల ముగింపు పురస్కరించుకొని రెండు బృందాలు ప్రదర్శించాయి. వివిధ పాటల మేళవింపుతో ఆద్యంతం ఆకర్షణీయంగా ప్రదర్శన సాగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్‌ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మరో వైపు అమ్మవారిని దర్శించుకోవడానికి రాత్రి కూడా లైన్‌లో భక్తులు నిరీక్షించారు. ఆరు బయట ఉన్న అమ్మవారి విగ్రహాన్ని దర్శించి పూజలు చేశారు.

కోటి మంత్ర యజ్ఞం ప్రారంభం

అనకాపల్లి: ఉగాది సందర్భంగా స్థానిక ఎన్టీఆర్‌ బెల్లం మార్కెట్‌ ఆవరణలో లక్ష్మీ గణపతి ఆలయంలో ఓం గం గణపతియే నమః కోటి మంత్ర యజ్ఞ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. లోక కల్యాణార్థం ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, విఘ్నాలు తొలగించే వినాయకుడి మూల మంత్రం జపం చేసుకోవాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్‌ ఆడారి కుమార్‌స్వామి కోరారు. ఎన్ని మంత్రాలు జపించారో వాటి సంఖ్యను వాట్సాప్‌ గ్రూపులో పెట్టాలని కోరారు. మరిన్ని వివరాలకు 7386613333 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేగి జగన్‌, పీ సోమశేఖర్‌ పట్నాయక్‌, బొట్టాచిన్ని యాదవ్‌, ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

పూడ్చిన నాలుగు మాసాలకే గుంతలు



గోతులతో నిండిన పరవాడ-వాడచీపురుపల్లి రహదారి



ఊటగెడ్డ మలుపులో ప్రయాణికులను భయపెడుతున్న గుంత

పరవాడ: గుంతలతో నిండిన వాడచీపురుపల్లి–పరవాడ రహదారితో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రహదారిలో పడిన గుంతలను నాలుగు నెలల క్రితం పూడ్చారు. నెలలు తిరక్క ముందే రోడ్డులో యథావిధిగా ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం తదితర గ్రామాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు, వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారు. రోడ్డులో పలు చోట్ల పడిన గుంతలతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే రహదారిలో రాకపోకలు సాగిస్తున్న బూడిద, బొగ్గు లారీల కారణంగా రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఊటగెడ్డ కూడలి మలుపులో తరచూ ఏర్పడుతున్న గుంతను పూడ్చేందుకు శాశ్వత చర్యలు చేపట్టట్లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణికుల ఇబ్బందుల్ని గుర్తించి రహదారిలో ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తులతో ఆలయాల కళకళ



కశింకోట కనకమహాలక్ష్మి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు కృష్ణ



ధ్యాన వేంకటేశ్వర స్వామి అలంకరణ



ఉగాది పచ్చడి పంచిపెడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

కశింకోట: ఉగాది పురస్కరించుకొని ఆదివారం ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని ఉగాదితోపాటు వారపు పొద్దు కలిసి రావడంతో భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, అరటి గెలలు తదితర రూపాల్లో అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక వేంకటేశ్వర ధ్యాన మందిరంలో ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూల విరాట్‌ను వజ్ర కవచంతోపాటు పూలమాలలు, తులసీమాలలతో అందంగా అలంకరించారు. 108 అష్టదళ పాద పద్మ స్వర్ణ పుష్పాలతో అర్చించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అర్చకుడు వి. చిదంబరం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. గవరపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు సుబ్రహ్మణ్యం పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. కనకమహాలక్ష్మి ఆలయంలో అర్చకుడు వి. కృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలోను, లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలోను, కోనేరు వద్ద అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి. మిగిలిన గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అనకాపల్లి టౌన్‌: పట్టణంలోని పలు ఆలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరుని, మెయిన్‌రోడ్‌ సిద్ధిలింగేశ్వరుని, గవరపాలెం భోగలింగేశ్వరుని, సంతోషిమాత ఆలయాల్లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా ఆయా దేవతామూర్తులకు విశేష పూజలు చేశారు. అమ్మవార్లకు పసుపుకుంకుమతో అర్చనలు చేశారు. తెల్లవారిజాము నుంచే భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర ఆలయంలో పంచాగ శ్రవణ కార్యక్రమం, గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద ఉగాది పచ్చడి వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన దుకాణాలు..

తెలుగు నూతన సంవత్సరం కావడంతో ప్రజలు ఏదో ఒక నూతన వస్తువును కొనుగోలు చేస్తుంటారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు పసుపు, కుంకుమ కొనుగోలుతో సరిపెట్టుకోగా, మరికొంత మంది వారి స్థాయికి తగట్టు గృహోపకరణాలు, బంగారం, దుస్తులు కొనుగోలు చేశారు.

నర్సీపట్నంలో టీ20 టోర్నీ ప్రారంభం

నర్సీపట్నం: టీ 20 క్రికెట్‌ పోటీలు హోరాహోరీగా సాగాయి. ప్రభుత్వ మహిళా జూనియర్‌ కళాశాల మైదానంలో నర్సీపట్నం ప్రీమియం లీగ్‌ సీజన్‌–1 టీ20 క్రికెట్‌ టోర్నమెంట్‌ ఆదివారం ప్రారంభమైంది. ఈ పోటీలను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్‌.విజయ్‌ ప్రారంభించారు. మొదటి బహుమతిగా రూ.66,666లు, రెండో బహుమతిగా రూ.33,333గా నిర్ణయించామని నిర్వాహకులు తెలిపారు. తొలి రోజు వివిధ జట్ల మధ్య పోటీలు ఉత్సాహంగా జరిగాయి.

వెంకన్న ఆలయానికి కిరీటాల బహూకరణ

మాడుగుల రూరల్‌: కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీదేవి, భూదేవి, అమ్మవార్ల అలంకరణ కోసం జలమూరు రామమోహన్‌రావు, వరలక్ష్మి దంపతులు, వారి అల్లుడు తిమ్మాపాత్రుని శ్రీనివాసరావు, ప్రమీలాదేవి(ఆస్ట్రేలియా) కిరీటాలు బహూకరించారు. దాతలు వాటిని ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావుకు అందజేశారు.